ప్రజాశక్తి

శనివారం 24 జూన్ 2023



మండుతున్న టమాటా ధర

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: ప్రస్తుతం కూరగాయల ధరలు పెరగడంతో గిరిజనులు కొనుక్కోలేని పరిస్థితుల్లో పలు ఇబ్బదులు పడుతున్నారు. వర్షభావంతో కూరగాయలు ధరలు మండుతున్నాయి. ఎండల తీవ్రతతో కూరగాయల పంటలకు నీరందక ఎండిపోయాయి. నెల రోజులుగా కూరగాయల ధరలు పైపైకి ఎక్కడంతో ఉప్పు, పప్పు, కారం, నూనెతో సరిపెట్టుకోవాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండలంలోని అరుకు సంతబయలులో శుక్రవారం జరిగిన సంతలో కేజీ టమాటా రూ.55తో కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.



గోదావరి తరంగంలా పాదయాత్ర

పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న యువత - పెరుగుతున్న మద్దతు - గోడు వెలిబుచ్చుతున్న పోలవరం నిర్వాసితులు



భారీ జన సమూహంతో సాగుతున్న పోరుకేక పాదయాత్ర

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన పోరుకేక పాదయాత్ర గోదావరి తరంగంలా ముందుకు సాగుతోంది. ఈ నెల 20వ తేదీన ఎటపాక మండలం నెల్లిపాకలో యాత్ర ప్రారంభమైన యాత్ర 21న కూనవరం మండలంలో అడుగుపెట్టింది. ఈ మండలంలో 32 గ్రామాల్లో సుమారు 50 కిలో మీటర్లు పైగా పాదయాత్ర సాగింది. కూనవరం మండలంలో పోలిపాక నుండి పోచవరం కాలనీ, పోచవరం, కాచవరం, దూగుట్ట, కూళ్లపాడు, నర్సింగపేట, పోట్లవాయిగూడెం, కరక గూడెం, కొండాయి గూడెం, గొమ్ముగూడెం జంక్షన్, పల్లూరు, మర్రిగూడెం, చూచిరేవుల గూడెం, భీమవరం, జగ్గవరం, టేకులబోరు, కొండ్రాజపేట, పూసుగూడెం, చిన్న ఆర్కూరు, పెద్ద ఆర్కూరు, రేపాక, భగవాన్ పురం, మల్లూరు, కూటూరు, అభిచర్ల, లింగాపురం, రేగులపాడు, కోడేరు, రాయిగూడెం, బొజ్జరాయిగూడెం గ్రామాల్లో పాదయాత్ర జరిగింది. అనంతరం శుక్రవారం చింతూరు మండలంలోకి అడుగుపెట్టింది. అన్ని గ్రామాల్లోనూ పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది.

పాదయాత్ర సందర్భంగా ఏజెన్సీలో ఎర్రజెండా రెపరెపలాడుతోంది. గిరిజనుల హక్కుల కోసం సిపిఎం ఈ ప్రాంతంలో నిర్వహించిన పోరాటాలు ఫలితంగా ఆదివాసీలలో ఆ పార్టీకి చెరగని ముంద్ర ఉంది. తాజాగా నిర్వహించిన పోరుయాత్రలోనూ అదే ఒరవడి కనిపిస్తోంది. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో పాల్గొనటం ప్రత్యేకత సంతరించుకుంది. కూనవరం మండలంలో గ్రామ గ్రామాన గిరిజన యువత తరలివచ్చింది. దీంతో తొలుత సుమారు 500 మందితో ప్రారంభమైన యాత్ర 23వ తేదీనాటికి 800కు చేరింది. ఈ యాత్రకు వామపక్ష పార్టీలతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు తమ మద్దతు తెలుపుతున్నారు.

గోడు వెల్లబుచ్చుతున్న నిర్వాసితులు

ఈ యాత్ర ఎదుట నిర్వాసితులు అనేక సమస్యలను విన్నవించారు. 'అభిచర్ల గ్రామంలో 250 కుటుంబాలు ఉన్నాయి. గతేడాది వరదల సమయంలో నెల రోజులు ముంపులో ఉంది. మూడు కిలో మీటర్లు వెళ్లి గుడిసెలు వేసుకుని జీవనం సాగించాం. వ్యవసాయ భూమి అంతా మునిగపోయింది' అని ఆ గ్రామస్తులు గోడు వినిపించారు.

'లింగాపురం 45.72 కాంటూరు పరిధిలో ఉందని చెబుతున్నారు. కాని గోదావరి భద్రాచలం వద్ద 37 మీటర్లకు చేరేనాటికే గ్రామం ముంపునకు గురైంది. 40 రోజుల పాటు గ్రామంలో వరద ముంపులో ఉంది. అయినా ముంపు గ్రామంగా ప్రకటించలేదు. పంట పొలాలకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదు. నాలుగు సంవత్సరాల నుంచి ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా కల్పించలేదు. గ్రామంలో 150 కుటుంబాలు ఉండగా, వరద సహాయం 70 కుటుంబాలకు మాత్రమే అందించారు' అని లింగాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

'రేగులపాడులో 300 కుటుంబాలు ఉన్నాయి. 250 కుటుంబాలు మునిగిపోయాయి. అయినా ముంపు గ్రామంగా ప్రకటించలేదు. గ్రామంలో రోడ్లు లేవు, మంచినీటి సౌకర్యం పూర్తిగా లేదు. వరద సమయంలో ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదు' అని ఆ గ్రామస్తులు వాపోయారు.

'రాయిగూడెంలో 28 కుటుంబాలు ఉన్నాయి. మా అడ్రసులు బొజ్జరాయి గూడెం చిరునామాతో ఉన్నాయి. ఈ కారణంతో మాకు ఎటువంటి నష్టపరిహారం, పునరావాసం అందలేదు. గిరిజన కుటుంబాలకు ఎటపాక రాయన గూడెంలో భూములిచ్చారు. కాని అక్కడి భూ యజమానులకు ప్రభుత్వం నగదు చెల్లించలేదు. దీంతో నేటికీ సాగు చేసుకునే అవకాశం మాకు కల్పించలేదు' అని రాయిగూడెం గ్రామస్తులు తెలిపారు.

వరదలకు సర్వం కోల్పోయాం



గతేడాది ఆగస్టు,క సెప్టెంబర్ నెలల్లో వచ్చిన వరదలు కారణంగా నా ఇల్లు పూర్తిగా మునిగి పోయింది. తిండి గింజలు కూడా లేకుండా మునిగిపోయాయి. ధాన్యం నాలుగు బస్తాలు, మినుములు రెండు బస్తాలు, పెసలు మూడు బస్తాలు నీటమునిగాయి. కట్టు బట్టలతో ప్రాణాలను కాపాటానికి గ్రామ సమీపంలోని చీకటి గుట్ట కొండపైకి చేరుకున్నాం. చీకటిలో పాములు, తెళ్లతో సహవాసం చేశారు. పస్తులతో ఉన్నాం. తాగునీరు లేక అలమటించాం. మాతో పాటుగా గ్రామంలో సుమారు 400 కుటుంబాలు వారు కొండపైన ఉన్నారు. కేవలం కొన్ని ఉల్లిపాయలు, రెండు కొవ్వొత్తిలు ఇచ్చారు. కనీసం గుడారం వేసుకునేందుకు బరకాలు కూడా అందజేయలేదు. పోలవరం పరిహారంతో పాటుగా ఇల్లు నిర్మించి ఇవ్వాలి. నాకు 10 ఎకరాల పొలం ఉంది. దానికి నేటికీ సర్వే చేయలేదు. పంట నష్టం కూడా ఇవ్వలేదు.

- కుర్సం రాజులు, కూమ్మురు గ్రామం, చింతూరు మండలం

ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ స్వాగతం

ప్రజాశక్తి- చింతూరు : ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్‌ఖాన్ పోలవరం పోరుకేక మహాపాదయాత్ర బృందానికి తన సంపూర్ణ మద్దతు తెలిపారు. చింతూరు శబరి బ్రిడ్జి వద్ద పాదయాత్రకు స్వాగతం పలికారు. ఈ పోలవరం పాదయాత్ర చేపట్టినందుకు గానూ ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాసితుల పట్ల సిపిఎం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని తమ మద్దతు పూర్తిగా ఉంటుందని తెలిపారు.



పాదయాత్రకు మద్దతు తెలియజేస్తున్న టిడిపి నాయకులు

చింతూరులో టిడిపి నేతల మద్దతు

ప్రజాశక్తి - చింతూరు, రాజమహేంద్రవరం ప్రతినిధి


పోలవరం పోరుకేక పాదయాత్ర కూనవరం మండలం రేగులపాడులో మధ్యాహ్న భోజనం అనంతరం బయలుదేరి రాయిగూడెం, బొజ్జరాయిగూడెం మీదుగా చింతూరు మండలంలోని కుమ్మూరుకు చేరుకుంది. అనంతరం చట్టి సెంటర్ మీదుగా చింతూరు మండల కేంద్రానికి వెళ్లింది. అక్కడి నుంచి యర్రంపేటకు చేరుకుని అక్కడే రాత్రి బస చేశారు. ఆ కూడలిలో స్వాంతంత్ర్య సమరయోధులు, గిరిజన అమర వీరులైన అల్లూరి సీతారామారాజు, కొమరం భీమ్, మల్లుదొర, గంటం దొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయిగూడెం, బొజ్జరాయి గూడెం, కుమ్మూరు గ్రామ ప్రజలు హారతులతో పాదయాత్రకు స్వాగతం పలికారు. చింతూరు టిడిపి మండల అధ్యక్షులు ఇళ్ల చిన్నారెడ్డి, మాజీ అధ్యక్షులు ఓబులనేని రామారావుచౌదరి, నాయకులు సాల్మన్ రాజు, యువజన నాయకులు సురేష్ చౌదరి పూలమాలలు వేసి స్వాగతం తెలిపారు. తమ మద్దతు తెలిపారు. చట్టి సెంటర్, చింతూరు సిపిఎం ఆఫీసు ఎదుట హారతులు పట్టి, తిలకం దిద్ది స్థానిక మహిళలు స్వాగతం పలికారు. కుమ్మూరు, చట్టి సెంటర్‌లలో బహిరంగ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలకతీతంగా పోలవరం నిర్వాసితులు ఐక్యం కావాలన్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఇళ్ల చిన్నారెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ధనదాహానికి పోలవరం నిదర్శనమని అన్నారు. పోలవరం ఏర్పాటుతో ఈ ప్రాంతం, మూడు లక్షల మంది జలసమాధి కావటం ఖాయమని సిపిఎం, వామపక్ష పార్టీలు ముందే చెప్పాయని గుర్తు చేశారు. అయినప్పటికీ విధ్వంసకర ప్రాజెక్టుకు వైఎస్ శంకుస్థాపన చేశారని తెలిపారు.



విల్లంబులు ఎక్కుపెట్టిన శ్రీనివాసరావు, సీతారాం, కిరణ్ తదితరులు



రాత్రి సమయంలో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న మహిళలు



వృద్ధుడు చెబుతున్న సమస్యలను వింటున్న శ్రీనివాసరావు



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తూ సందడి చేస్తున్న యువత



మాట్లాడుతున్న ప్రభావతి

మహిళలపై దాడులను నియంత్రించాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి- పెదబయలు: రోజురోజుకి మహిళలపై పెరుగుతున్న హింస, దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మహిళా సంఘ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హింస, అశ్లీల చలన చిత్రాలు, టివి సీరియల్స్, ఇంటర్నెట్‌లను నిషేదించాలన్నారు. కళాశాలల్లో, పని ప్రదేశాల్లో వేధింపులు నిరోదించాలని, ఇందుకు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్దాలను నియాంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు విద్య, ఉపాధి కల్పించాలనే డిమాండ్స్ తో పోరు యాత్ర చేపడతామన్నారు. ఆగస్ట్ 9న విజయవాడ లో జరిగే భారీ బహిరంగ సభలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవసంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో అల్లూరి జిల్లా అధ్యక్షులు హై మావతి , టి కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతర ఉపాధ్యాయుల

బదిలీలు రద్దు చేయాలి

- ఎమ్మెల్యేకు ఆదివాసీ గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: జిఒ 3కు చట్టబద్ధత కల్పించి మైదాన ప్రాంత గిరిజనేతర ఉపాధ్యాయులకు ఏజెన్సీలో బదిలీలు వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు శుక్రవారం అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణకు క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మాట్లాడారు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో జిఒ 3 పై సుప్రీంకోర్టులో కేసు నడుస్తుడంగా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనేతర సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జిటి) 400 మందిని వివిధ ప్రభుత్వ స్కూల్స్‌లో కొత్తగా బదిలీలు ఎలా చేస్తారని అన్నారు. గిరిజనేతర ఉద్యోగులను గిరిజన ప్రాంతానికి తరలించడం గిరిజన హక్కులకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఉందని తక్షణమే బదిలీలు రద్దు చేయాలని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ 3పై ఎందుకు రివ్యూ పిటిషన్ దాఖలు లేదని, గిరిజనులపై ఎందుకు వివక్షత చూపుతున్నారని మండిపడ్డారు.పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ప్రాంత ఉపాధ్యాయులు గిరిజన ప్రాంతాల్లో బదిలీలు ప్రక్రియ మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, మండల అధ్యక్షుడు జి.బుజ్జి బాబు,కె.రామారావు, కె.మగ్గన్న, టి.హరి, సత్యనారయణ, జోషి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సర్దుబాటు పేరుతో..

విద్యుత్ ఛార్జీల వసూళ్లను నిలిపి వేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలోని వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాన్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స పిలుపునిచ్చారు. పాడేరు సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన ప్రజా, విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి. సిపిఐ మండల కార్యదర్శి కూడా రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, స్థిర చార్జీలు, కస్టమర్, విద్యుత్ సుంకం, ట్రూ అప్ చార్జీలు, 2014 సంవత్సరం నుండి 2019 వరకు, అక్కడి నుండి 2021 సంవత్సరంలో ఇంధన కొనుగోలు సర్దుబాటు, 2023లో ఇంధన కొనుగోలు సర్దుబాటు చార్జీల పేరుతో, అసలు కరెంట్ బిల్లు కాకుండా, బిల్లుపై మరో ఆరు రకాల అదనపు బిల్లులు వేసి విద్యుత్ వినియోగదారుల జేబులు లూటీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ఎత్తుగడ వేసిందన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో మరో భారం, విద్యుత్ వినియోగదారులపై వేయబోతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దీనిపై ప్రకటించిందని, ప్రతి ఇంటికి ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించనున్న ప్రభుత్వం, స్మార్ట్ మీటర్ల డబ్బులను 10 సంవత్సరాల పాటు 120 నెలలు వినియోగదారుల బిల్లులో వేసి వసూలు చేయనుందని అన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కంటే, ఆదాని సేవల కోసమే జగన్ సర్కార్ పనిచేస్తుందని విమర్శించారు. ఇప్పటికే నూతన విద్యుత్ విధానం పేరుతో 20వేల కోట్లు విద్యుత్ వినియోగదారుల నుండి గుంజుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు ప్రైవేట్ విద్యుత్ సంస్థలతో చేసుకున్న అడ్డగోలు ఒప్పందాలు, బొగ్గు సరఫరా, అవినీతి కార్పొరేట్లకు మేలు చేసే చర్యలు, విద్యుత్ సంస్థల అపసవ్య విధానాలతో విద్యుత్ చార్జీల భారం తడసి మోపెడవుతోందని అన్నారు. సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రభుత్వాలే భరించాలని విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడంలో విద్యుత్ నియంత్రణ మండలి విఫలమయిందని విమర్శించారు. ప్రజలంతా సంఘటితమై మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి ఎల్ సుందర్రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే ప్రభుదాస్, జన వేదిక నాయకులు ఆనందరాజు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎఇ జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స

స్పందనకు 170 దరఖాస్తులు

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 170 ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఒ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవలతో కలిసి జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా అధికారులు జగనన్న సురక్షా కార్యాక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పెదబయలు మండలం బొంగరం గ్రామ పంచాయతీ మట్టల గుమ్మి గ్రామంలోని ఉపాధి హామీ పనుల్లో వి. ఆర్.పి చిన్న తల్లి సక్రమంగా మస్టర్లు నమోదు చేయడం లేదని గ్రామస్తులు టి. విశ్వనాథం, టి.చిన్నారావు, పపెన్ కుమార్ ఫిర్యాదు చేసారు. జి.కె. వీధి మండలం జర్రెల పంచాయతీ గునుకురాయి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, జర్రెల గ్రామానికి డి ఆర్ డిపో భవనం మంజూరు చేయాలని సర్పంచ్ వి. నాగరాజు వినతి పత్రం సమర్పించారు. డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ దూదుగుడ గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. పోతంగి పంచాయతీకి చెందిన కమ్మిడి నిర్మల, కించు మండ గ్రామానికి చెందిన బి. చిన్నెయ్య అటవీ హక్కుపత్రాలు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. జి.మాడుగుల మండలం పెదలోపలి పంచాయతీ గొడ్డు గుర్రాల బంధ గ్రామస్తులు పంతల చిరంజీవి, పాంగి సుందర రావు గొడ్డు గుర్రాల బంధ గ్రామం నుండి పనసల పాడు గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ పాత మాడెంబంధ గ్రామస్తులు ఎం. అప్పారావు, వి.రామన్న, ఎం.మత్స్యరాజు మాడెం బంద కొత్తవీధి నుండి మాడింబంద పాతవీధికి రోడ్డు నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఎపిఒ వి.ఎస్.ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, పంచాయతీ రాజ్ ఇఇ టి. కొండయ్యపదాల్, పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్, భాషా, డి.ఎల్.పి.ఓ పి.ఎస్. కుమార్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సమస్యలపై ఉధృత పోరాటం

- యుటిఎఫ్

ప్రజాశక్తి - అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి యుటిఎఫ్ పోరాటానికి సన్నద్ధమైంది. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయం వద్ద యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బుడిగి. దేముడు ఆధ్వర్యాన సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి. దేముడు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు అనేక సమస్యలతో దీర్ఘాలికంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జీవో నెంబర్3, సిపిఎస్, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతభత్యాలు చెల్లించాలని ు పలు అంశాలను తీర్మానంలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ సహా అధ్యక్షులు శెట్టి .రాంబాబు, మండల సీనియర్ నాయకులు వివి. ఈశ్వరరావు, మండల ప్రతినిధులు మల్లేశ్వరరావు, రఘు, నారాయణ, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఐసిడిఎస్ కార్యాలయంలో తనిఖీలు



మాట్లాడుతున్న ఆర్‌జెడి

ప్రజాశక్తి- పెదబయలు: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంను శుక్రవారం ఆర్‌జెడి చిన్మయి దేవి సందర్శించారు. స్థానిక సీడీపీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో అంగనవాడీ కార్యకర్తలు, వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ, అంగనవాడి కేంద్రాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీసారు. బాలింతలు, గర్భిణీలకు జులై నెల నుండి ప్రతినెలా 25 రోజుల వరకు సరిపడే బియ్యం, కంది పప్పు, వంట నూనెతో పాటు వైస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును అందింస్తున్నట్లు తెలిపారు. 15 రోజులకొకసారి 12 కోడిగుడ్లు, పాలు, అందిస్తామని తెలిపారు. నాడు నేడు ద్వారా 396 అంగనవాడి కేంద్రాలకు నిధులు మాంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పిడి సూర్యలక్ష్మి, సీడీపీఓ ఏం.రాజేశ్వరి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

సంఘాల సభ్యులకు చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు: బ్యాంకు లింకేజీని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూడకోట శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 115 సంఘాలకు రూ.1కోటి 13 లక్షల బ్యాంకు లింకేజీ చెక్కును సంఘాల సభ్యులకు శుక్రవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ అందించాలన్నారు. బ్యాంకు లింకేజీ తీసుకున్న సంఘాలు సకాలంలో తిరిగి వెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కామరాజు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో లక్ష్మీపురం పంచాయితీ కేంద్రంలో సర్పంచ్ కొర్ర త్రినాథ్ అద్యక్షతన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫమ్మింగ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిహెచ్ కామరాజు మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుల మందులు, దిగుమడుగులపై తెలిపారు.

జ్యూట్‌మిల్లు స్థలాలు కొని మోసపోవద్దు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు యాజమాన్యం అమ్మకానికి పెట్టిన స్థలాలను కొని ప్రజలు మోసపోవద్దని టిడిపి జిల్లా కార్యదర్శి పిట్టా సురేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికార వైసిపి కనుసన్నల్లోనే చిట్టివలస జ్యూట్‌మిల్లు స్థలాలను కొంతమంది దళారుల ద్వారా అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జ్యూట్ కార్మికులకు పూర్తిగా నష్ట పరిహారం చెల్లించ్ఛకుండానే ఇప్పటికే ఆస్తులను అమ్మకానికి పెట్టిన యాజమాన్యంపై కోర్టుల్లో కేసులు నమోదౌతున్నాయన్నారు. దళారుల ప్రమేయంతో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న భూముల్లో ప్రభుత్వ బంజర్లు, నదీగర్భాలు, చెరువు లు, కోనేర్లు,గ్రామ కంఠం స్థలాలు ఉన్నాయని, వాటిని కొని నష్టపోవద్దని సూచించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.ఏళ్లతరబడి క్వార్టర్స్‌లో ఉన్నవారికి ఖాళీ చేస్తేఊరుకునేది లేదన్నారు. సమావేశంలో టిడిపి టిడిపి వార్డు అధ్యక్షులు త మ్మిన సూరిబాబు, బడిగింటి నీలకంఠం, గిడుతూరి శ్రీనివాసరావు, జోగ సన్యాసిరావు పాల్గొన్నారు

1 నుంచి ఇంటి వద్దకే అంగన్వాడీ సరుకులు



మాట్లాడుతున్న జెసి శివశ్రీనివాస్

ప్రజాశక్తి-పాడేరు: జూలై ఒకటవ తేదీ నుండి అంగన్వాడి సరుకులను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు లబ్ది దారుల ఇంటికే పంపిణీ చేయాలని సంయుక్త కలక్టర్ జే.శివ శ్రీనివాసు ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఐసిడిఎస్ అధికారులు, సరఫరాదారులతో నిర్వహించిన సమావేశంలో జేసి మాటాడుతూ, జిల్లాలో 19 అంగన్వాడీ ప్రాజెక్టుల పరిధిలో 1791 అంగన్వాడి కేంద్రాలు, 1423 మినీ అంగన్వాడి కేంద్రాలు ఫరిధిలో నున్న ఆరు సంవత్సరాల పిల్లలు 1,15,757 మంది, గర్బిణీలు, బాలింతలు 21,680 మంది కలిపి మొత్తం 1,37,437 మంది లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. వీరందరికీ టేక్ హెూం రేషన్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన బియ్యం, కంది పప్పు, పామాయిల్, గుడ్లు, పాలు, రాగి పిండి తదితర సరుకుల కిట్లను ఇంటికే పంపించాలని ఆదేశించారు. అదేవిధంగా సరఫరాదారులు సకాలంలో కిట్లను సంబంధిత ప్రాజెక్టులకు పంపించాలని, కిట్లు అందిన వెంటనే ఆయా అంగన్వాడీ కేంద్రాల ఫరిధిలో లబ్దిదారులకు పంపిణీ చేయాలని జేసి ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎన్.సూర్యలక్ష్మి, పలువురు సిడిపిఓలు పాల్గొన్నారు.

నీతి, నిజాయితీతో ఉన్నత శిఖరాలకు..

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఆత్మీయ సమావేశంలో భార్య ఉషతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి -మధురవాడ : నీతి, నిజాయితీ ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, తన జీవితంలో అదే జరిగిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. శుక్రవారం రుషికొండ ఏ1 గ్రాండ్‌లో వెంకయ్యానాయడు 50ఏళ్ల ప్రజా జీవనం, సేవ, అనుబంధంపై సహచర బృందంతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా, రాజకీయ జీవితంలో తన ఎదుగుదలకు సహకరించిన తన సతీమణి ఉష తో పాటు ఇతరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజా జీవనంలో సమయపాలన అవసరమన్నారు. దేశం ముందకు వెళ్లాలంటే ఎవరి పని, బాధ్యతలను వారు చిత్తశుద్ధితో నిర్వహించడం ఎంతో అవసరమన్నారు.
కార్యక్రమంలో ముఖ్యఅతిథిటగా పాల్గొన్న కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లోతనకు వెంకయ్యానయుడు దిశానిర్దేశం చేశారన్నారు. రాజకీయ జీవితంలో ఎలా మసలుకోవాలనే విషయాలను వెంకయ్యానాయుడును చూసి తాను నేర్చుకున్నానన్నారు. స్నేహితులంటే ప్రాణాలిచ్చి అభిమానించే వెంకయ్య నాయుడు తో ఒక్కసారి ప్రయాణం చేస్తే, ఎక్కడకెళ్లినా బతికే యగలమన్న జీవిత పాఠాలను నేర్చుకో వచ్చున్నారు.50ఏళ్ల రాజకీయ, ప్రజాప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న వెంకయ్యానాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

టెస్ట్ క్రికెటర్ భరత్‌కు ఘన సత్కారం



భరత్‌ను సత్కరిస్తున్న ఎసిఎ, విడిసిఎ ప్రతినిధులు

ప్రజాశక్తి పిఎం పాలెం: .దీక్ష, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని టెస్ట్ క్రికెటర్ కెఎస్ భరత్ అన్నారు. శుక్రవారం విడిసిఎ ఆధ్వర్యంలో.భరత్‌ను ఎసిఎ విడిసిఎ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ప్రపంచకప్ క్రికెట్‌లో ఆడడమనే తన కల సాకారమైందని, దీనికి ఎసిఎ - విడిసిఎ మద్దతు ఎంతో ఉందన్నారు. కీపింగ్ చేయడం తనకిష్టమని, ఆటలో దాన్ని ఎంతో ఎంజాయ్ చేస్తున్నానన్నారు .ఎసిఎ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎసిఎ తరుపున భరత్‌లాంటి మరింత మంది ఆటగాళ్లను తయారు చేయడమే లక్ష్యమన్నారు. విడిసిఎ అధ్యక్షుడు విష్ణు కుమార్‌రాజు మాట్లాడుతూ విశాఖ కుర్రాడు అంతర్జాతీయ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కోచ్ కృష్ణారావు, సిఇఒ శివ రెడ్డి, పార్థసారధి పాల్గొన్నారు. .

జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి

- మండల ప్రత్యేకాధికారి గోవిందరాజులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులందరికీ లబ్ది చేకూరుతుందని మండల ప్రత్యేకాధికారి జిల్లా పౌర సంబంధాల అధికారి పి. గోవింద రాజులు పేర్కొన్నారు. శుక్రవారం జి. మాడుగుల మండల కార్యాలయంలో తహసిల్దార్, ఎంపిడిఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిపిఆర్‌ఓ మాట్లాడుతూ, ప్రతి వాలంటీర్ వారికి కేటాయించిన గృహాలను సందర్శించి ఆయా కుటుంబ సభ్యుల అవసరాలను గుర్తించాలన్నారు. వారిదె దరఖాస్తు చేయించాలని, సంబంధిత డాక్యుమెంట్లతో డిజిటల్ సహాయకుల ద్వారా సచివాలయంలో ఆన్‌లైన్ చేయించాలన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ లబ్ది పొందకుండా మిగిలి పోరాదన్న ముఖ్యమంత్రి ఆశయ సాధన లక్ష్యంగా అందరం కలసి పని చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజలకు కావలసిన 11 రకాల ధృవ పత్రాలను ఈ నెల రోజులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో 18 సచివాలయాల ఫరిధిలో శిభిరాలు నిర్వహించడానికి షెడ్యూల్ తయారు చేశామని, తహసిల్దార్, ఎంపిడిఓ రెండు బృందాలు ఆయా గ్రామాలు సందర్శిస్తారని తెలిపారు. ఆయా గ్రామాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రత్యేకాధికారి కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై వివరించారు.

ఎంఇఒకు సన్మానం



ఎంఇఒను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెదబయలు : మండల విద్యాశాఖధికారిగా గుమ్మా పుష్పవతి శుక్రవార బాధ్యతలు చేపట్టారు. స్థానిక బాలుర రెసిడెన్సియల్ పాఠశాల సమావేశం మందిరంలో పరిచయం కార్యక్రమం నిర్వహించారు . అనంతరం నూతన విద్యాశాఖధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఉపాధ్యాయులు ఆమెను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య హాజరయ్యారు. మాజీ మండల విద్యాశాఖధికారి సువర్ణరాజు, ప్రిన్సిపాల్ డి.శంకర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్



క్రాఫ్ట్ బజార్‌ను ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి -పిఎం పాలెం: మధురవాడ శిల్పారామం జాతరలో విశాఖ అర్టిసియన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్, హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అమ్మకాలను మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వాళనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 రాష్ట్రాలకు చెందిన హస్తకళలు, చేనేత ఉత్పత్తిదారులు తమ ఉత్పతులను ఈబజార్‌లో 60 స్టాల్స్‌లో ప్రదర్శనకు నిర్వాహకులు ఏర్పాటు చేశారన్నారు. క్రాఫ్టబజారును సద్వినియోగం చేసుకోవడం ద్వారా వృత్తి కళాకారులను, చేనేత, హస్తకళల ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. విశాఖ ఆర్టిసియన్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు మహమ్మద్ నసీమ్, సలీం మాట్లాడుతూ 23 రోజులపాటు ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ప్రదర్శనలో ఉంచే వస్తువుల వివరాలను వెల్లడించారు.. కార్యక్రమంలో శిల్పారామం ఎఇ విశ్వనాథ్ రెడ్డి, ముత్తుంశెట్టి మహేష్, పిల్లా సుజాత సత్యన్నారాయణ, పోతిన హనుమంత్ రావు, బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీనివాస్, పోతిన ప్రసాద్, వంకాయల మారుతి ప్రసాద్, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, అల్లాడ లింగేశ్వర రావు, పొతిన మూర్తి బాబు, పిల్లా రమణ, సియ్యాద్రి కనకరాజు, రాయిన సాయి, జగుపిళ్ళ నరేష్ పాల్గొన్నారు.



నాడు అల్లూరి దాడి చేసిన పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పి తుహిన్ సిన్హా

24 గంటలూ అందుబాటులో పోలీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

లా అండ్ ఆర్డర్ పరిరక్షణ, ప్రజాసేవ కోసం 24 గంటలూ పోలీసులు అందుబాటులో ఉంటారని అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. శుక్రవారం ఆయన రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలోని రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది పనితీరు తదితర వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన ముగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తొలిత ఎస్పీ తుహిన్ సిన్హా, రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి రాజవొమ్మంగిలో ఉన్న అల్లూరి సీతారామరాజు దాడి చేసిన పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ సందర్శకులకు అనుకూలంగా భవనాన్ని స్మారక చిహ్నంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంజాయి రవాణా, గంజాయి సాగు వంటి వాటిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి తరలించిన, విక్రయించిన, సాగు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వాహన తనిఖీలు చేపట్టడం, వాహనదారులకు అవగాహన కల్పించడం చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ సమస్యను ధైర్యంగా చెప్పుకోవచ్చన్నారు. రాజవొమ్మంగి సీఐ బాజీలాల్, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్‌ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్‌ల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, హైదరాబాద్ ఐసిఎఆర్, ఐఐఆర్ఆర్ వారి సౌజన్యంతో గిరిజన రైతులకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉచితంగా వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి 1318 ఎంటిసి వరి విత్తనాలు దేవీపట్నం. రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు సంబంధించిన సుమారు 200 మంది గిరిజన రైతులకు ఒక్కొక్కరికి 30 కేజీల వరి విత్తనాలు చొప్పున సుమారు 6 టన్నులు పంపిణీ చేసినట్లు చెప్పారు. రైతులు అగ్రికల్చర్ అసిస్టెంట్ల సూచనలు సలహాలు తీసుకొని సాగు చేయాలని సూచించారు. ఏజెన్సీలోని కోతులు నిర్మూలనకు ఆయా గ్రామాలలో రైతులు కలిసికట్టుగా సోలార్ పెన్సింగ్ వేసుకోవాలన్నారు. రంపచోడవరం ఎంపిపి బంధం శ్రీదేవి మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిశోధించి, ఏజెన్సీ ప్రాంతానికి సరిపడే విధంగా వరి విత్తనాలను సరఫరా చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. రంపచోడవరం జెడ్పిటిసి సభ్యురాలు పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం భరత్‌లక్ష్మి. బి శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు. కృష్ణాజీ, ఆనంద్ కుమారి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి చౌదరి, అగ్రికల్చరల్ ప్రాజెక్ట్ అధికారి రాంబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.లక్ష్మణ్, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, కొంచెం వంశీ పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని రేవళ్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో డి.ఉమాదేవి, పంచాయతీ సర్పంచి వెంకటలక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచి నాగేంద్ర, ఏఈవో సత్యనారాయణ. గ్రామ వ్యవసాయ సహాయకులు రూపాదేవి, స్థానిక పెద్దలు దేముడు, కుశల తదితరులు పాల్గొన్నారు.

సీలేరు- భద్రాచలం రహదారిలో కూలిన భారీ వృక్షం

నిలిచిన రాకపోకలు - ప్రయాణికులకు ఇబ్బందులు



రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

ప్రజాశక్తి -సీలేరు

అల్లూరి జిల్లా, జికె.వీధి మండలం, దుప్పిలివాడ పంచాయతీ పరిధి వలసగెడ్డ గ్రామ సమీపంలో సీలేరు-భద్రాచలం ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున భారీ వృక్షం కూలిపోయింది. రహదారికి ఆనుకొని ఉన్న ఈ భారీ వృక్షం ఇప్పటికే పక్కకు వాలిపోయి ఉంది. ఈ క్రమంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి భూమి నానిపోయి భారీ వృక్షం వేళ్లతో పాటు రోడ్డుపై కూలిపోయంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ వృక్షాన్ని తొలగించేందుకు సీలేరు అటవీ శాఖ రేంజ్ గార్డు చిట్టిబాబు వారి సిబ్బంది చర్యలు చేపట్టారు. స్థానిక గిరిజనులతో చెట్టు నరికించేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయితే ఆ చెట్టుకు తేనె పట్టు ఉండడంతో తేనెటీగలు చెలరేగడంతో చెట్టు పూర్తిస్థాయిలో కొట్టడానికి సాధ్యపడలేదు. గిరిజనులు అక్కడ నుండి వెనుదిరిగారు. దీంతో ఈ మార్గంలో పూర్తిగా వాహనాల రాకపోకలు ఆగిపోయాయి.

పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు

శుక్రవారం తెల్లవారుజాముున భారీ వృక్షం ప్రధాన రహదారికి అడ్డంగా పడిపోయినా ఆర్ అండ్ బి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఆంధ్ర, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు ప్రధాన రహదారిపై అంతరాయం ఏర్పడితే ఆర్ అండ్ బి అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరించడంపై ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రహదారిపై పడి ఉన్న భారీ వృక్షాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణికులను తరలించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు

ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను వారిని గమ్య స్థానానికి చేర్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించారు. విశాఖ నుండి భద్రాచలం వెళ్లే బస్సు శుక్రవారం తెల్లవారుజామున సీలేరులో బయలుదేరగా వలసగెడ్డ సమీపంలో భారీ వృక్షం కూలిపోవడంతో అక్కడ బస్సును నిలిపివేశాడు. విజయవాడ నుండి సీలేరు వస్తున్న బస్సులో ఉన్న ప్రయాణికులు ఆటోలు, ఇతర వాహనాల్లో సీలేరు చేరుకున్నారు. విశాఖ నుంచి భద్రాచలం బస్సులో ఉన్న ప్రయాణికులను విజయవాడ నుండి వచ్చిన బస్సులో భద్రాచలం పంపించారు. భద్రాచలం నుండి విశాఖ వస్తున్న బస్సులో ప్రయాణికులను, సీలేరు వైపు ఆగిపోయిన విశాఖపట్నం బస్సులో ఎక్కించి విశాఖపట్నం తరలించారు. విశాఖ నుండి భద్రాచలం వెళ్లే మరో బస్సులోని ప్రయాణికులను భద్రాచలం నుంచి వచ్చిన బస్సులో భద్రాచలం పంపించే ఏర్పాట్లు చేశారు. విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లవలసిన బస్సుని వెనుక్కి తీసుకొచ్చారు. ఈ బస్సు రాత్రి 9 గంటలకు సీలేరు నుంచి విశాఖపట్నం బయలుదేరింది.

జగనన్న సురక్షపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని అమీనాబాద్ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం జులై 1 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తుందని, ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపులలో కుల, నివాస, ఆదాయ, పుట్టిన తేదీ, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లతో మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ ఫర్ కరక్షన్స్, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మొబైల్ నెంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్‌కార్డులు, రేషన్‌కార్డులు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో సభ్యుల పేర్ల తొలగింపు వంటి 11 సర్వీసులు ఈ క్యాంపులలో ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ నెల 24 నుంచి వాలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాల్సి ఉందని చెప్పారు. వినతుల స్వీకరణ, రిజిస్ట్రేషన్లు, వెరిఫికేషన్, వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

దీనిపై సిబ్బంది శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది రమేష్, వీరబాబు, శ్రీనివాసు, కిషోర్ వాలంటీర్లు పాల్గొన్నారు. ముందుగా అమీనాబాద్‌లో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను ఎంపిడిఒ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఉపాధి కూలీల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి చైతన్య నగర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలకు కూలి సొమ్ము చెల్లించాలంటూ శుక్రవారం ఉపాధి పని ప్రదేశంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీ తెడ్ల రాంబాబు మాట్లాడుతూ తాము 6 వారాలుగా ఎండనక, వాననక కష్టపడి చమటోర్చి ఉపాధి పనులు చేసినప్పటికీ నేటికీ కూలి సొమ్ములు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిరుపేద కూలీలమని, రెక్కాడితేనే గాని డొక్కాడని పరిస్థితి ఉందని, ఉపాధి కూలీ సొమ్ము ఆరు వారాలుగా అందకపోతే ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి కూలి సొమ్ము చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి చైతన్య నగర్ గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

శ్రమదానంతో పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి- కొయ్యూరు

మండలంలోని వైఎన్ పాకలు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానం చేసి గ్రామంలోని పిచ్చి మొక్కలు, తుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంసి చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిశుభ్రతకు నడుం బిగించినట్లు తెలిపారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటే, వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో టిఏ రాజు, వీఆర్పీలు డేవిడ్, గంగరాజు పాల్గొన్నారు.

26న నాడు-నేడు, విద్యా కానుకపై సమావేశం

ప్రజాశక్తి - కొయ్యూరు : మనబడి నాడు-నేడు, జగనన్న విద్యా కానుక కార్యక్రమాలపై ఈనెల 26వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ఏటీడబ్ల్యూవో, ఎంఈవో, సీడీపీవో, ఈవోపీఆర్డీ, ఏపీఎం, ఏఈఈ, ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్వైజర్లు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పూర్తి సమాచారంతో కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక సిఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. మంప గ్రామ శివారు నుండి బూదరాళ్ల గ్రామ శివారు వరకు గల రహదారి వెంబడి ఉన్న బ్రిడ్జిలు, కల్వర్టులను స్నిపర్ డాగ్, ఏపీఎస్పీ బలగాలతో తనిఖీ చేశారు. అల్లూరి సీతారామరాజు పార్కులను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఘాట్ రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో ఇజ్జలూరు జంక్షన్ సమీపంలో భారీ టర్నింగ్ వద్ద కాకినాడ నుండి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు సాంకేతికత లోపంతో శుక్రవారం ఉదయం ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు మూడు గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గోకవరం నుండి టెక్నీషియన్ రావడంతో మరమ్మతులు చేయించి బస్సును అక్కడినుండి తీయడం జరిగింది. ఘాట్ రోడ్డులో తరచూ వాహనాలు మరమ్మతులు గురవుతుండడంతో ఈ మార్గంలో ప్రయాణికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడవలసిన వస్తుంది. ఫిట్‌నెస్ ఉన్న బస్సులను మాత్రమే నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తహాశీల్దారుగా జయసూర్యకుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం మండల నూతన తహాశీల్దారుగా పివివి జయ సూర్య కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డిప్యూటీ తహాశీల్దారుగా పని చేసినట్లు చెప్పారు. ప్రమోషన్‌పై రంపచోడవరం తహాశీల్దారుగా వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నూతన తహాశీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డిప్యూటీ తహాశీల్దారు పి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ దూడ ఇందిర, వీఆర్వోలు పోడియం శ్రీను, పి.రవికుమార్, మార్తమ్మ, జి.ప్రభాకర్, సాయి తదితరులు అభినందనలు తెలిపారు.

మారేడుమిల్లి ఎంపిడిఒగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి మారేడుమిల్లి : మారేడుమిల్లి నూతన ఎంపీడీఓగా వివి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి కృషి చేస్తానని చెప్పారు. గతంలో ఇంచార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించిన వెంకట రమణ మూర్తి తన పూర్వ విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. నూతన ఎంపీడీఓ బాధ్యతలను స్వీకరించిన శ్రీనివాసరావును సిబ్బంది అభినందించారు.